### కేబీఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫణీంద్ర



బంజారాహిల్స్, మార్చి 29 : బంజారాహిల్స్ కేబీఆర్ పార్కులోని నేచర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఫణీంద్ర గోటేటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేచర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న లయన్ విజయ్ కుమార్ మృతి చెందడంతో ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న అధ్యక్ష పదవికి ఫణీంద్రను కమిటీతో పాటు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫణీంద్ర మాట్లాడుతూ.. 33 ఏండ్లుగా కేబీఆర్ పార్కులో వాకర్‌గా ఉండటంతో పాటు యోగా శిక్షకుడిగా సుపరిచితుడిగా ఉన్నానని తనకు ఇచ్చిన అవకాశంతో వాకర్లకు మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతానన్నారు.కమిటీకి ప్రధాన కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, కోశాధికారిగా సురేశ్ అగర్వాల్ కొనసాగుతున్నారు. ।

### నేటి నుంచి ఉగాది పద్య నాటకోత్సవాలు

ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఆదివారం నుంచి ఐదురోజుల పాటు ఉగాది నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. చుక్కపల్లి శంకర్‌రావు శత జయంతి సందర్భంగా ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ సహకారంతో నిర్వహించే నాటకోత్సవాల్లో భాగంగా 30న, శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక నాటకం, 31న బాలనాగమ్మ జానపద నాటకం, ఏప్రిల్ 1న సత్య హరిశ్చంద్ర నాటకం, 2న భక్త చింతామణి నాటకం, 3న కురుక్షేత్రం నాటకాలను ప్రదర్శిస్తారని నిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. రంగస్థల నాటకాలపై నేటితరానికి అవగాహన ఉండడం కోసం, కళాకారులను ఆదుకునే లక్ష్యంతో నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆయా నాటకాలను ప్రదర్శిస్తారని తెలిపారు.

# ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బండ్లగూడ, మార్చి 29 : రాజేంద్రనగర్ లో మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు సబితా ఇంద్రారెడ్డిని శనివారం కలిసారు. రాజేంద్రనగర్ లో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవన్ దాస్, మాజీ అధ్యక్షులు రాజకుమార్, పంబాల రాజు, సామెల్, పచ్చ శ్రీనివాస్, రాముయాదవ్, రఘు యాదవ్, అరుణ్, మహేశ్, ఆదిరాల రవికుమార్, ఎడ్ల కాడి సూర్యం, చంద్రశేఖర్, బాబురావు, సుమన్, వెంకటరమణ, జనార్ధన్, గౌతమ్, రమేశ్, నర్సింగరావు పాల్గొన్నారు.



శంషాబాద్ మహనీయుల ఉత్సవాల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబును సన్మానిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

### మహనీయుల జయంతి ఉత్సవాల సంఘం అధ్యక్షుడిగా చిట్టిబాబు

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మహనీయుల జయంతి ఉత్సవాల సంఘం అధ్యక్షుడిగా రాచమల్ల చిట్టిబాబును ఎన్నుకున్నట్లు ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ తెలిపారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మహనీయుల ఉత్సవాల సంఘం అధ్యక్షుడిగా చిట్టిబాబును ఎన్నుకున్నట్లు వివరించారు. ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్‌రావ్, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించిన్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షుడినిగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిన్నగండు రాజేందర్,భాస్కర్, కే రమేష్, లడ్డు,నాయకులు పాల్గొన్నారు.















చైతన్యయాత్రకు స్వాగతం పలుకుతున్న ఖైరతాబాద్ ఉద్యమకారుల ఫోరం నాయకులు

## హామీలు నెరవేర్చాలి

బంజారాహిల్స్ : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర శనివారం బంజారాహిల్స్‌కు చేరుకున్నది. ఖైరతాబాద్ నియోజక వర్గం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఉద్యమకారులు జీవీకే చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు 25 వేల పెన్షన్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని, హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజక వర్గం ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ జెట్టి విజయ్‌కుమార్, కో – కన్వీనర్ నాగరాజు, సీనియర్ నాయకులు నక్క రఘు, గ్రేటర్ కో – కన్వీనర్ జగన్, మోహనాచారి, పర్వతాలు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేయాలి



హైదర్ గూడలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేశ్‌కుమార్

హిమాయత్ నగర్ : కేంద్రం దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాకు బీసీలు తరలి వచ్చి విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ పిలుపు నిచ్చారు. శనివారం హైదర్‌గూడలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ చేతుల మీదుగా ధర్నాకు సంబంధించిన వాల్ పో స్టర్ ఆవిష్కరించారు. నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలన్నారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలు, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎర్ర శ్రీహరి, వి.శివ కుమార్, మల్లేశ్ యాదవ్, గిరిగాని భిక్షపతిగౌడ్, నర్సింలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జనపనార ఉత్పత్తులతో లాభాలు



బ్రోచర్ విడుదల చేస్తున్న కృషి విజ్ఞానకేంద్రం మామునూరు ప్రధాన శాస్త్రవేత్త డా.రాజన్న

వ్యవసాయ యూనివర్సిటీ : జనాపనార ఉత్పత్తులు లాభదాయకమని. కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు ప్రధాన శాస్త్రవేత్త డా.రాజన్న అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్, పి.వి.నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జనపనార సంచుల తయారీ, శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధనా యాజమాన్యసంస్థ సమావేశ మందిరంలో కార్యక్రమం ముగిసింది. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పశువులు తినడంతో మరణాలు సంభవిస్తాయని నార్మ్ జాయింట్ డైరెక్టర్ రామసుబ్రమణియన్ అన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళికలో విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అమీర్‌పేట్ ప్రభావన మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీ జ్యూట్ యూనియన్ డాక్టర్ అరుణజ్యోతి తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణజ్యోతి, నామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నిర్మల, డాక్టర్ సాయికిరణ్, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాదగిరి





బండ్లగూడ : రాజేంద్రనగర్ కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసోజు యాదగిరిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మామిడి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.బందయ్య, సంయుక్త కార్యదర్శిగా కె.జ్ఞానేశ్వర్ చారి, కోశాధికారిగా వి.లక్ష్మయ్య, మహిళా కార్యదర్శిగా ఆర్.అనిత, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా కిరణ్ కుమార్, లైబ్రేరియన్‌గా అమృత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా భగీందర్ సింగ్, యశ్వంత్, రాజు, రమేశ్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం వెంగళరావు నగర్ కాలనీ లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రవిశేఖర్ రెడ్డి పారిశుధ్య కార్మికులకు కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమములో రాణి, సన్నీగౌడ్, మల్లేశ్‌గౌడ్, కుమారి, నాగరాజ్, భరత్ పాల్గొన్నారు.

- వెంగళరావు నగర్



జూబ్లీహిల్స్ : రంజాన్ సందర్భంగా ప్రార్థన చేసేందుకు రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో ఈద్గా పనులు జరుగుతున్నాయి. శనివారం డీసీ జాకియా సుల్తానా, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ఈఈ రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఏ ఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వణిధర్, కాంట్రాక్టర్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

### బైక్‌ను ఢీకొన్న కారు దంపతులకు గాయాలు

వెంగళరావునగర్ : వేగం, అజాగ్రత్తతో వచ్చిన కారు ఓ బైక్ ను ఢీ కొనడంతో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం..గాజులరామారం కైసర్ నగర్‌కు చెందిన మటన్ వ్యాపారి షేక్ షరీఫ్ భార్య సల్మాబేగంతో కలిసి చార్మినార్‌లో రంజాన్ సందర్భంగా షాపింగ్ చేసి తిరిగి వెళ్తుండగా.. అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ సమీపంలోని చిల్లావద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొన్నది. బైక్‌పై నుంచి దంపతులు ఎగిరిపడ్డారు. సల్మాబేగం తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుడి భుజానికి దెబ్బలు తగిలాయి. ప్రమాదంలో షరీఫ్ కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం స్థానికులు దవాఖానకు తరలించారు.ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారవుతుండగా..స్థానికులు ప ట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని కారు నడిపిన బ్యాంక్ ఉద్యోగి సాయికృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### తాగిన మైకంలో వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్

మద్యం తాగిన మైకంలో స్టీరింగ్ పట్టి వాటర్ ట్యాంకర్‌ను డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. శనివారం ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు మూసీపేట్‌కు చెందిన శ్రీవాణి వాటర్ ట్యాంకర్ సప్లై కేంద్రానికి చెందిన టీఎస్09 యూ ఈ 4113 ట్యాంకర్‌ను పోలీసులు ఆపి డ్రైవర్ మాధవరావుకు పరీక్ష చేయగా బీఏసీ181 పాయింట్లుగా నమోదైంది. కేసు నమోదు చేశారు.

### దొంగతనానికి యత్నం..

ఖైరతాబాద్ : ఇంట్లో ఎవరూ లేరనుకొని గోడదూకిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పంజాగుట్ట పీఎస్ పరిధిలో ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట కమ్మం సంఘం ప్రాంతంలో నివాసం ఉండే ఉషా శ్యామల ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. శ్యామల కేకలు వేయడంతో సదరు దొంగ పరిపోయేందుకు యత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో దుబ్బాకకు చెందిన పాత నేరస్తుడు పర్స వెంకట్రాములుగా గుర్తించారు. శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పన్ను చెల్లించి..అభివృద్ధికి సహకరించండి



ఆస్తి పన్ను రూ.61 లక్షల చెక్కును డీసీ రవికుమార్‌కు అందజేస్తున్న గోల్డ్ డ్రాప్ సంస్థ ప్రతినిధి



సమావేశంలో 2025 –26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రత్యేక అధికారి శ్రీధర్

బండ్లగూడ : ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకారం అందించాలని రాజేంద్రనగర్ డీసీ రవికుమార్ పేర్కొన్నారు. గోల్డ్ డ్రాప్ సంస్థ వారు 11 ఏండ్ల బకాయి ఉన్న 60 లక్షల 51 ఆస్తి పన్నును శనివారం చెక్కు ద్వారా చెల్లించారు. ఆ సంస్థ ప్రతినిధి రాజేంద్రనగర్ డీసీకి మొత్తం చెక్కును అందజేశారు. రంజాన్, ఉగాది పండుగ రోజుల్లో తమ కార్యాలయం తెరిచి ఉంటుందని ప్రతి ఆస్తి పన్ను దారుడు తమ హస్త పనులు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### అంచనా వ్యయం రూ.153 కోట్లు

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ 2025 –26 ఆర్థిక సంవత్సరానికి అంచనా వ్యయం బడ్జెట్ ను శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి శ్రీధర్ వెల్లడించారు. మొత్తం 153 కోట్ల 90 లక్షల రూపాయల అంచనా వేయను రూపొందించారు. ఇందులో నెలసరి జీతాలు 8 కోట్ల ఇరవై ఒక్క లక్ష, పారిశుద్ధ నిర్వహణకు 15 కోట్ల 76 లక్షలు, విద్యుత్ బిల్లులు మూడు కోట్ల 88 లక్షలు, హరిత నిధి 6 కోట్ల 36 లక్షలు, ఇంజనీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులు కోసం 23 కోట్ల 57 లక్షలు, సాధారణ పరిపాలన విభాగంలో వివిధ ఖర్చులు మూడు కోట్ల 56 లక్షలు, టౌన్ ప్లానింగ్ విభాగ ంలో వివిధ ఖర్చుల నిమిత్తం 41 లక్ష, 1/3 వంతు నిధులు మిగులు వేయం నాలుగు కోట్ల 35 లక్షలు, ప్రజా సౌకర్యాల ఖర్చులు 6 కోట్ల 83 లక్షలు, వార్డుల వారీగా వివిధ అభివృద్ధి పనుల ఖర్చులు 79 కోట్ల 55 లక్షలు గా అంచనా వ్యయంను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్చంద్ర, డి.యాదయ్య,అధికారులు పాల్గొన్నారు.



చెక్కును స్వీకరిస్తున్న డీసీ జాకియా సుల్తానా, ఏఎంసీ బాల్ రాజ్, సిబ్బంది.

### 14ఏండ్ల బకాయి చెల్లింపు

జూబ్లీహిల్స్ : ఆస్తిపన్ను చెల్లింపులకు మరో 2 రోజులు మాత్రమే గడువు ఉన్నందున 2024–25 ఆర్థిక సంవత్సరంతో పాటు పాత బకాయిలను చెల్లించి వడ్డీ పై 90 శాతం రాయితీ పొందాలని డీసీ జాకియా సుల్తానా కోరారు యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని ఎర్రగడ్డకు చెందిన ప్రైవేట్ విద్యా సంస్థ నుంచి 14 ఏండ్లుగా పెండింగ్ రూ. 56,87,848 విలువైన చెక్కును ఏఎంసీ బాల్ రాజ్ తో కలిసి స్వీకరించారు. కార్యక్రమంలో ట్యాక్స్‌ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## పిల్లలకు సాహిత్య ప్రేరణ కల్పించాలి



మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 29: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శ్రీరామ్‌నగర్ నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విశ్వవసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకోని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలకృష్ణ, క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామిలు పాల్గొన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు పద్యాల పోటీలు, ఎక్కల పోటీలను నిర్వహించారు.కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీశ్, సంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, మానవ సేవే మాధవ సేవడైరెక్టర్ హేమలత, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

## డ్రైవింగ్ నేర్పిస్తానంటూ..

బంజారా హిల్స్ : స్నేహితుడికి డ్రైవింగ్ నేర్పిస్తానంటూ మద్యం సేవించి కారు నడిపి ప్రమాదానికి కారణమైన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాలకు వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.12 లో ఉంటున్న రాజ్‌కిరణ్ క్యాబ్‌డ్రైవర్. స్నేహితుడికి డ్రైవింగ్ నేర్పిస్తానంటూ శుక్రవారం అర్ధరాత్రి మద్యం సేవించి బంజారాహిల్స్ రోడ్ నం.12 వైపు నుంచి జూబ్లీ హిల్స్ రోడ్ నం. 92 మీదుగా వెళుతున్నాడు. అదుపు తప్పడంతో ఎడమవైపు కార్ డికార్ షోరూం లోకి దూసుకెళ్లింది. ఘటనలో కారు ఎదుటి భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు నడిపిస్తున్న రాజ్‌కిరణ్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు రాజ్‌కిరణ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయగాగా 94 బీఏసీ పాయింట్లుగా వచ్చింది. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బైండ్ల కులస్తులు వెనుకబడి ఉన్నారు..



ఎర్రగడ్డ : ఎస్సీల్లో బైండ్ల కులస్తులు వెనుకబడి ఉన్నారని బైండ్ల కుల సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బోరబండలో శనివారం జరిగిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అన్ని జిల్లాలకు కుల సంఘాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బైండ్ల కులంలో ప్రతి కుటుంబంలో ఒక ఉద్యోగం సాధించే దిశగా ముందుకు వెళ్దామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కుల సంఘానికి చెందిన క్యాలెండర్లను పంపిణీ చేయటం జరిగింది. సమావేశంలో సంఘం రాష్ట్ర సలహాదారు బైండ్ల నరసింహ, సంఘం నాయకులు బైండ్ల కృష్ణ, బైండ్ల యాదగిరి పాల్గొన్నారు.

### స్టాక్ మార్కెట్ మహిళ పాలిట శాపంగా మారిందా?

బండ్లగూడ : రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన డబ్బును స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసి నష్టపోవడంతో మనోవేధనకు గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అత్తాపూర్ పీఎస్ పరిధి లో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. హుడా కాలనీలో నివాసం ఉంటే పింకీ (37) అమీశ్ లోయతో ఏడాది క్రితం రెండో వివాహం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు తర్వాత పెద్దఎత్తున చేయాలని అనుకున్నారు. పింకీ మెహందీ ఆర్టిస్టుగా పనిచేస్తూ డబ్బులు సంపాదించుకుంటూ జీవనం సాగిస్తుంది. భర్త ఫైనాన్షియల్ అడ్వైజర్ గా పనిచేస్తున్నారు. పింకీ మెహేంది పనులు చేస్తూ సంపాదించిన డబ్బులను అనీశ్‌కుకు ఇవ్వడంతో డబ్బులను స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. నష్టం వచ్చినట్లు పింకీకి తెలిపాడు. దీంతో ఆమె మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పింకీ తల్లి మున్నిదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

### భార్యపై దాడి..

బంజారాహిల్స్ : భార్యను జుట్టు పట్టుకొని లాగడంతో పాటు విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డ భర్తపై జూబ్లీ హిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే .. వెంకటగిరిలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వివాహిత భర్త భోగి విక్రమ్‌కు కొన్నేండ్లుగా గొడవలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని స్నేహితురాలి ఫ్లాట్‌లో ఉన్న వివాహిత వద్దకు వచ్చిన భర్త విక్రమ్ ఆమెపై తీవ్రస్థాయిలో బూతులు తిడుతూ దాడికి దిగాడు. జుట్టు పట్టుకొని కింద పడేశాడు. మెడకు చున్నీతో బిగించి చంపేందుకు యత్నించాడు. ఆమె స్నేహితురాలి ఫోన్ లాక్కుని పగలగొట్టేసాడు. వారి ఇంట్లోని టీవీని పగలగొట్టాడు. గతంలో కూడా పలుమార్లు తనపై భర్త దాడి చేశారని, కుటుంబ సభ్యుల ఎదుటే చంపేందుకు యత్నించాడనీ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.